GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

GSTIN-NO : 36FKPSI308PIZX Cell : 8919710365

టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
epaper:tmedia.net.in YouTube

టి మీడియా ఆన్లైన్ సర్వీస్ & న్యూస్ ఏజెన్సీ
మీరు ఉన్న దగ్గర నుండే సేవలకోసం కాల్ చేయండి : 8500515365
➤ కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు విడిజేసే, స్వదేశీ విద్య కోసం ఇచ్చే ఆర్థిక సహాయాల దరఖాస్తుల ప్రాసెసింగ్
➤ ఎమ్మెల్సీ ఓటు, జనరల్ ఓటు నమోదు కోసం
➤ లేబర్ డిపార్ట్మెంట్ లైసెన్స్ అప్లికేషన్ ప్రాసెసింగ్
➤ కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో డిజిటల్ మీడియా నిర్వహణ కోసం
➤ ప్రభుత్వ పథకాలు ఇతర కాంపిటేటివ్ పరీక్షల దరఖాస్తుల ప్రాసెసింగ్ తదితర ఆన్లైన్ సర్వీసులు

సంపుటి : 6 | సంచిక : 196 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం : మార్చి 01-2024 | పేజీలు : 3

# మెగా డీఎస్సీ

## నోటిఫికేషన్ విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

### తొలిసారిగా ఆన్‌లైన్‌ఎగ్జామ్

### మార్చి 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### గతంలో అప్లైచేసినోళ్లు మళ్లీ దరఖాస్తుచేసుకోవద్దు

**టీ మీడియా, ఫిబ్రవరి 29, హైదరాబాద్ :**

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ను ప్రభుత్వం జారీ చేసింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో విడుదల చేశారు. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు డీఎస్సీ దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు రుసుం రూ. 1000గా ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 11 పట్టణాల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన తేదీలను సర్కారు త్వరలో ప్రకటించనుంది. గతంలో దరఖాస్తు చేసినవాళ్లు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని.. కొత్త డీఎస్సీకి వాటిని పరిగణనలోనికి తీసుకోనున్నారు. గతేడాది సెప్టెంబరు 6న 5,089 పోస్టులతో జారీ చేసిన డీఎస్సీ ప్రకటనను రద్దు చేస్తూ నిన్న రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టులను అదనంగా పెంచి తాజాగా నోటిఫికేషన్ ఇచ్చింది.

#### ఏజ్ లిమిట్

- 18 నుంచి 46 సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ లకు ఐదేళ్ల సడలింపు
- వికలాంగులకు 10 ఏండ్ల వరకు సడలింపు
- ఎక్స్ సర్వీస్ మెన్స్ కు మూడేళ్ల సడలింపు
- ఐదేండ్ల కన్నా ఎక్కువ సర్వీస్ ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తుకు అర్హులు



#### దరఖాస్తు, ఫీజు

- మార్చి 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 3 చివరి తేదీ
- దరఖాస్తు ఫీజు రూ. 1000గా నిర్ణయించారు. దీనిని ఆన్ లైన్లో చెల్లించాల్సి ఉంటుంది.
- గతంలో దరఖాస్తు చేసుకున్న మళ్లీ దరఖాస్తుచేసుకోవద్దు.

#### ఆన్ లైన్ పరీక్ష

- తొలిసారిగా డీఎస్సీని సీబీఆర్టీ (కంప్యూటర్‌బేస్‌డ్‌రిటెన్‌టెస్ట్) పద్ధతి ద్వారా ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం 11 సెంటర్లు ఏర్పాటుచేశారు.
- మహబూబ్ నగర్
- రంగారెడ్డి
- హైదరాబాద్
- మెదక్
- నిజామాబాద్
- ఆదిలాబాద్
- కరీంనగర్
- వరంగల్
- ఖమ్మం
- నల్లగొండ
- సంగారెడ్డి

#### పోస్టులు

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లు
**6,508**

స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)
**2,629**

లాంగ్వేజ్‌పండిట్
**727**

పీఈటీలు
**182**

ప్రత్యేక కేటగిరీలో..

| స్కూల్ అసిస్టెంట్లు | ఎస్జీటీ పోస్టులు |
|---|---|
| 220 | 796 |

### త్వరలో రాత పరీక్ష తేదీల ప్రకటన

## సౌర విద్యుత్ పథకం కి క్యాబినెట్ ఆమోదం

### -కోటి ఇళ్ల కి నెలకు 300లు యూనిట్లు ఉచిత విద్యుత్



**టి మీడియా, ఫిబ్రవరి 29,ఢిల్లీ:** సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్యులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించేలా కేంద్రం సరికొత్త పథకం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దాని అమలు దిశగా మరో ముందడుగు పడింది. 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన 'కు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఈ పథకంతో కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించనుంది.

రూ.75,021 కోట్లతో రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ కు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. 2025 నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు వెబ్‌సైట్‌లో గృహ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ఈ పథకాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తరువాత బడ్జెట్‌లోనూ దీనికి కేటాయింపులు చేయగా.. ఫిబ్రవరి 13న ప్రధాని ఈ స్కీమ్‌ను ప్రారంభించారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్నవారు ఒక కిలోవాట్ సోలార్ ప్యానళ్లకు రూ.30వేల వరకు సబ్సిడీ పొందొచ్చు. మిగిలినది బ్యాంకు రుణం కల్పిస్తారు. రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు అంతకంటే ఎక్కువ కిలోవాట్లకు రూ.78వేలు రాయితీగా ఇస్తారు.

## రూ.65 లక్షల పాల కుంభకోణం

### ఐ సి డి ఎస్ ప్రాజెక్టు అధికారిణి అరెస్టు



**టీ మీడియా, ఫిబ్రవరి 29,కరీంనగర్** :నిధుల దుర్వినియోగం వ్యవహారంలో.. సిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిణి అనిశెట్టి శ్రీదేవిని ఏసీబీ అరెస్టు చేసింది..కరీంనగర్ కోర్టులో ఆమెను హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో గతంలో సీడీపీవోగా పనిచేసిన సమయంలో శ్రీదేవి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. 322 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి దాదాపు రూ.65.78 లక్షల నగదును దారి మళ్లించినట్లు గుర్తించారు. ఆరోగ్యలక్ష్మి పాల సరఫరా ఖర్చులపై నకిలీ ఇండెంట్లను సృష్టించి నగదు కాజేసినట్లు దర్యాప్తులో తేల్చారు.

## ఆశావహుల ఇంటర్వ్యూలతో బిజీబిజీ



**టి మీడియా, ఫిబ్రవరి 29,విజయవాడ :** కాంగ్రెస్ టికెట్ ఆశావహుల ఇంటర్వ్యూ బుధవారం ప్రారంభమయ్యింది. గురువారం కూడా కొనసాగుతోంది. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ లో ఈ ముఖాముఖి సాగుతోంది. బుధవారం నరసాపురం, నరసరావుపేట, ఏలూరు, బాపట్ల, గుంటూరు, మచిలీపట్నం లోక్ సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 49 అసెంబ్లీ స్థానాలకుగాను 280 మంది దరఖాస్తు చేసుకోగా వారందరితో షర్మిల చర్చించారు. ఒక్కొక్కరినీ ఇంటర్వ్యూ చేయడంతో చాలా సమయం పట్టింది%ా% దీంతో రాత్రి ఒంటిగంట వరకు షర్మిల కాంగ్రెస్ కార్యాలయంలోనే ఉన్నారు. ఆశావహులు తమ అనుచరులతో ఆంధ్రరత్న భవన్ లో అర్ధరాత్రి వరకు కోలాహలం నెలకొంది. కాంగ్రెస్ టికెట్ ఆశావహుల ఇంటర్వ్యూలు గురువారమూ కొనసాగుతున్నాయి. మిగతా లోక్ సభ నియోజకగర్గాల పరిధిలోని అసెంబ్లీల వారిగా ఆశావహులతో షర్మిల మాట్లాడనున్నారు. వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు గెలుపు కోసం ఎంత సీరియస్ గా పనిచేస్తారో తెలుసుకోనున్నారు. కాబట్టి ఇవాళ కూడా అర్ధరాత్రి వరకు ఈ ఇంటర్వ్యూలు కొనసాగే అవకాశం ఉంది

**తెలంగాణ స్ఫూర్తితో:**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహం సక్సెస్ కావడంతో దాన్నే ఫాలో అవుతోంది ఏపీ కాంగ్రెస్. ఇప్పటికే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గేతో ఏపీలోని ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ.5 వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఇక త్వరలోనే ఏపీకి ప్రత్యేక హెూదాపై కూడా మరో డిక్లరేషన్ ప్రకటించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఇలా గ్యారంటీలు, డిక్లరేషన్ల పేరిట హామీలు ఇచ్చి తెలంగాణలో మాదిరిగానే ఆంధ్ర ప్రదేశ్ లో అధికారాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

## 30,000 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి

### గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ



**టీ మీడియా, ఫిబ్రవరి 29, గాజా :**

సుమారు ఐదు నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న అమానవీయ దాడులతో పాటు కరువు పరిస్థితుల కారణంగా 30,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ నేతృత్వంలోని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఈ వివరాలు ప్రకటించింది. గాజాస్ట్రిప్‌లో బుధవారం రాత్రి సుమారు 79 మంది మృతులతో కలిపి మొత్తం 30,000 మంది మరణించినట్లు వెల్లడించింది. ఈజిప్ట్, ఖతార్, అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు సంబంధించి ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య చర్చలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నాటికి సంధి కుదరవచ్చని భావిస్తోంది. గాజాలోని అల్-షిఫా ఆస్పత్రిలో పౌష్టికాహార లోపం, డిహైడ్రేషన్, కరువు కారణంగా చిన్నారులు మరణించారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్ ఖుద్రా పేర్కొన్నారు. ఈ మరణాలను నివారించడానికి 'తక్షణ చర్యలు' చేపట్టాలని అంతర్జాతీయ సంస్థలకు పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ మరిన్ని సరిహద్దులను తెరవాల్సిన అవసరం ఉందని, దీంతో అవసరమైన మానవతా సాయం పెరగవచ్చని యుఎస్ఎఐడి అధ్యక్షుడు సమంతా పవర్ పేర్కొన్నారు. 'ఇది జీవన్మరణ సమస్య' గా మారిందంటూ గాజాలో క్షీణిస్తున్న పరిస్థితులపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### 14 మంది మృతి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, మధ్యప్రదేశ్ :**

మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లాలో గురువారం తెల్లవారుజామున పికప్ వాహనం బోల్తా పడడంతో 14 మంది మృతి చెందగా, 20 మంది గాయపడ్డారని పోలీసు అధికారి తెలిపారు. బద్జార్ ఘాట్ సమీపంలో తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వాహనం డ్రైవర్ చక్రాలపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారు రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. దీంతో 14 మంది మృతి చెందగా, 20 మంది గాయపడ్డారని అధికారి తెలిపారు. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితులు జిల్లాలోని షాపురా బ్లాక్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమ్హై దేవ్రీ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే దిండోరి కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బాధితులను ఆదుకునేందుకు రంగంలోకి దిగారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. దిండోరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రమాదంలో బాధితులందరినీ గుర్తించారు. మృతులను బాబు లాల్ ఆర్మో (40), పితం (16), పున్ను లాల్ (55), మహదీ బాయి (35), సెమ్ బాయి (40), లాల్ సింగ్ (55), ములియా (60) కుమారుడు మదన్ సింగ్, టిత్రి బాయి. (50), సావిత్రి (55), సర్జు (45), సంహర్ (55), మహా సింగ్ (72), లాల్ సింగ్ (27) కిర్పాల్ (45)గా గుర్తించారు.

## డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని 6 వ వార్డ్ పీర్లగుట్ట డబుల్ బెడ్ రూమ్ ల సమస్యల వలయంగా ఉందని లబ్ధిదారులు కాంటెస్టడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్ కి వివరించారు. ప్రధానగా నీటి పైపులు పగిలిపోవడం వల్ల వారం రోజుల నుంచి ఉంది. ఈ డబుల్ బెడ్రూమ్ 296 ఇండ్లకు 130 మంది లబ్ధిదారులు నివసిస్తున్నారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా విద్యుత్ లైట్స్, స్థంబాలు, మిషన్ భగీరథ వాటర్ లైన్ లేదు. మున్సిపాలిటీ పారిశుధ్యం సమస్య 11, 13 బ్లాక్ బీసీ హాస్టల్ నుంచి రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్ల విష సర్పాలు ఇబ్బందులకు గురి అవుతున్నామని తెలిపారు. అధికారులు ఇండ్లని ఇచ్చారు కాని మమల్ని మరిచారు ఈ అంశాలపై కలెక్టర్ కి పలుమార్లు ప్రజావాణిలో అర్జీలు పెట్టాము కానీ ఫలితం లేదని లబ్ధిదారులు తెలియజేశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కాంటెస్టడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్ కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, రామకృష్ణాపూర్** : క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ సూపర్ బజార్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు,మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పల్లె రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలలో మరో రెండు పథకాలు 500/రూపాయలకు గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు విద్యుత్ ఫ్రీ పథకాలను అలాగే సింగరేణి కార్మికుడు ఏదైనా ప్రమద వశత్తు మరణిస్తే 1 కోటీ రూపాయల ఇన్సూరెన్స్ వర్తించేలా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సందర్భంగా గురువారం వారికి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఏర్రం విద్యాసాగర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు,సీనియర్, యూత్ నాయకులు,మహిళా నాయకురాళ్ళు,తదితరులు పాల్గొన్నారు.

## కమలం పార్టీ తీర్థం తీసుకున్న బీఆర్ఎస్ ఎంపీ రాములు



**టి మీడియా, ఫిబ్రవరి 29,ఢిల్లీ:** బీఆర్ఎస్‌కు తాజాగా మరో షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీని వీడిన నాగర్‌కర్నూల్ ఎంపీ బీజేపీ కండువా కప్పుకున్నారు. గురువారం నాగర్‌కర్నూలు ఎంపీ ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ సహా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు.రాములు బీజేపీలో చేరడాన్ని ఎంపీ లక్ష్మణ్ స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ శక్తివంతంగా మారుతోందని చెప్పారు. తెలంగాణలో ఇన్నాళ్లు తమకు ఎదురు లేదనుకున్న బీఆర్ఎస్‌కు.. ప్రజలే షాక్ ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బీఆర్ఎస్ మునిగిపోయిన నావ.. కారు రిపేర్ అయ్యి షెడ్‌కు వెళ్లిందని విమర్శించారు. ఇక రిపేర్ అయిన కారు బయటకు వచ్చే పరిస్థితులు లేవన్నారు. అయితే.. ఈ మార్పులు కాంగ్రెస్ మాత్రం లాభపడిందని లక్ష్మణ్ అన్నారు. కానీ.. ఇతర రాష్ట్రాల్లో మాత్రం కాంగ్రెస్ పరిస్థితి దిగజారిపోతుందని చెప్పారు. బీజేపీ అన్ని చోట్ల బలపడుతోందని అన్నారు.అన్ని పార్టీల నుంచి రాజకీయ నాయకులు బీజేపీలో చేరేందుకు ఆసక్తిని చూపుతున్నారని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు బీజేపీ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని చెప్పారు. తెలంగాణలో అధిక స్థానాలను బీజేపీ గెలవబోతుందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ దీమా వ్యక్తం చేశారు.

## చంద్రబాబు వద్ద ఊడిగంతోనే పవన్ అధ:పాతాళానికి పోయాడు

- మంత్రి రోజా సెటైర్లు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, అమరావతి :**
ఏపీ మంత్రి రోజా పవన్ కళ్యాణ్ పై సెటైర్లు వేశారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా బహిరంగ సభలో పవన్ ఆవేశంతో మాట్లాడిన తీరుపై రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ను పాతాళానికి తొక్కి వేస్తానని మాట్లాడిన తీరును చూస్తుంటే తీవ్ర ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు అర్థమవుతుందని అన్నారు. ' చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్నప్పుడే నువ్వు పాతాళానికి దిగజారిపోయావని, ఊగిపోయి మాట్లాడితే ఓట్లురావు. అదే జరిగితే ఆర్ నారాయణమూర్తి ప్రధాన మంత్రి అయ్యేవాడని ' సెటైర్లు వేశారు. 175 అసెంబ్లీ సీట్లు, 25 పార్లమెంట్ స్థానాలున్న ఏపీలో ముష్టి 30 సీట్లుకూడా పొత్తుల్లో దక్కించుకోని పవన్ వైఎస్ జగన్ గురించి మాట్లాడడమా అంటూ విమర్శించారు. తనను ప్రశ్నించవద్దంటూ పవన్ వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ అనైతిక పొత్తులపై జనసేన నాయకులు, కార్యకర్తలు ఎందుకు ప్రశ్నించవద్దని అన్నారు. పార్టీ నిర్మాణాన్ని గాలికొదిలి చంద్రబాబు చుట్టూ తిరుగుతున్నాడని ఆరోపించారు.

## సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదు

- సుప్రీంకోర్టు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, న్యూఢిల్లీ:**
సివిల్, క్రిమినల్ కేసుల్లో దిగువ కోర్టు లేదా హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ ఉత్తర్వులు ఆరు నెలల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దు కావని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. దిగువ కోర్టుల స్టే ఆర్డర్‌లను ప్రత్యేకంగా పొడిగించకపోతే అవి రద్దు అవుతాయన్న 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పుతో తాము ఏకీభవించడం లేదని రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. కాగా, కేసుల పరిష్కారానికి కాలక్రమాన్ని నిర్ణయించడం రాజ్యాంగ ధర్మాసనం, సుప్రీంకోర్టు, హైకోర్టులు మానుకోవాలని రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. కేవలం అసాధారణ పరిస్థితులలో మాత్రమే అలా చేయవచ్చని పేర్కొంది. ఈ మేరకు వేర్వేరుగా రెండు ఏకకాల తీర్పులను గురువారం ప్రకటించింది. సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదని న్యాయమూర్తి ఏఎస్ ఒకా తెలిపారు. అలాగే మార్గదర్శకాలకు సంబంధించి విడిగా, ఏకకాలిక తీర్పును న్యాయమూర్తి పంకజ్ మిథాల్ వెల్లడించారు.

## ధ్వజారోహణంతో కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**టీ మీడియా, ఫిబ్రవరి 29, తిరుపతి :**
శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం నుంచి ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ శాస్త్రోక్తంగా ప్రారంభ మయ్యింది. అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మీన లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. జేఈవో వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 4న గరుడసేవ, మార్చి 5న స్వర్ణరథోత్సవం, మార్చి 7న రథోత్సవం, మార్చి 8న చక్రస్నానం జరుగనున్నట్టు తెలిపారు. తమిళనాడులోని తిరునిన్రవూరుకు చెందిన శ్రీమద్ రామానుజ కైంకర్య ట్రస్టు ప్రతినిధులు రెండు గొడుగులను కానుకగా జేఈవో వీరబ్రహ్మంకు అందించారు.

## బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్

- అభినందించిన టీఆర్ఎస్ వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి మున్సిపల్ కమిషనర్ గా బదిలీపై వచ్చిన పూర్ణచందర్ ని ఆహ్వానిస్తూ అభినందిస్తున్న టిఆర్ఎస్ పార్టీ వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి. వనపర్తి పట్టణం అభివృద్ధి కొరకునిస్వార్థంగా పనిచేయాలని, వనపర్తి పట్టణంలోని మిగిలిపోయిన రోడ్డు వెడల్పు పనులు, దళిత వాడల అభివృద్ధి మొదలగు మిగిలిపోయిన పనులు పూర్తిచేయాలని వనపర్తి పట్టణ ప్రజలు మీరు చేస్తున్న పనులు ఎల్లవేళలా గుర్తించుకునే విధంగా కృషి చేయాలని వారిని కోరారు.

## జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన మాజీ ఐఎఎస్ అధికారి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, అమరావతి :**
ఏపీకి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంతియాజ్ వచ్చే ఎన్నికల్లో కర్నూలు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఆయన ఇటీవలే స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. గతంలో ఆయన సెర్ప్ సీఈవోగా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఏపీలో జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరిట అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఎంతగానో మేలు చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కర్నూలు మేయర్ బివై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సాత్మల ప్రాజెక్టులో దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



**టీ మీడియా, ఫిబ్రవరి 29, ఆదిలాబాద్ :**
ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పరీక్షలు మిస్ అయ్యాయననే మనస్థాపంతో ఓ విద్యార్థి నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో చోటు చేసుకుంది. జైనథ్ మండలం మాంగూర్ల గ్రామానికి చెందిన శివకుమార్ అనే ఇంటర్ విద్యార్థి సాత్మల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షలు మిస్ చేసినందుకు తనను క్షమించాలంటూ సుసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నిత్య జీవితంలో జరిగే సంఘటనల నుంచి సైన్సును నేర్చుకోవాలి

- డిఎస్ఓ శ్రీనివాసులు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనిగిల్లలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిత్యజీవితంలో విజ్ఞాన శాస్త్రం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు హాజరయ్యారు. నిత్యజీవితంలో సైన్స్ ఆవశ్యకతను, నమ్మకాలను, మూఢనమ్మకాలను విద్యార్థులకు వివరించారు. సమాజంలో మంత్రగాళ్లు ప్రజలని ఎలా మోసం చేస్తారో వివిధ ప్రయోగాల ద్వారా చూపారు. నీళ్లను మండించడం, తమ జేబులోని బంతిని మాయం చేయటం, దిష్టి వెనుక ఉన్న మూఢనమ్మకాలు, చేతబడి లాంటి వాటి కిటుకులను చేసి చూపించారు. పొటాషియం పర్మాంగనేట్, సల్ఫర్లను ఉపయోగించి గాలిలో ఉండే వస్తువులను ఎలా మండిస్తారో విద్యార్థుల ఎదుట ప్రదర్శించి, సైన్సు సూత్రాన్ని వివరించారు. మంటను మింగడం అద్భుతమేమి కాదని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. 10వ తరగతి విద్యార్థులకు వారి పరీక్షల దృష్ట్యా అవసరమైన మోటివేషన్ కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శంకర్ గౌడ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు గౌడ్, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, సురేంద్రనాథ్, విజయ్ కుమార్, శ్రీరాములు, కస్తూరి, యామిని తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో లెఫ్ట్ దారి ఎటువైపు


## కాంగ్రెస్ కలుపుకు పోయేనా



**టీ మీడియా, ఫిబ్రవరి 29, హైదరాబాద్ :**
పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఒక్కచోటైన పోటీ చేయాలని వామపక్షాలు పట్టుదలతో ఉన్నాయి. కాంగ్రెస్ కనికరిస్తే కలిసి ఒక్క సీటులో పోటీ చేస్తామని సీపీఐ అంటుంటే.. ఇండియా కూటమిలో భాగమైన తమకు పొత్తులో ఒకసీటు ఇవ్వాలని సీపీఎం అంటోంది. పొత్తు పొడవకపోయిన పోటీ తథ్యమని ఎర్రసైన్యం తెగేసి చెబుతోంది.తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాల పోటీపై ఇంకా క్లారిటీ రావడం లేదు. కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని సీపీఐ, సీపీఎం భావిస్తున్నా.. పొత్తు చర్చలు మాత్రం పొడవడం లేదు. ఇప్పటికే ఐదు స్థానాలను సీపీఐ పార్టీ కాంగ్రెస్‌కు ప్రతిపాదించి ఏదో ఒక్క సీటు ఇచ్చినా చాలంటూ చెప్పింది. తమ కలయికతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అదే పంథాలో ఇప్పుడు పార్లమెంట్‌లోనూ కలుపుకొని వెళ్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఖమ్మం, భువనగిరి, నల్గొండ, పెద్దపల్లి, వరంగల్ స్థానాలను సీపీఐ ప్రతిపాదించింది. ఆయా పార్లమెంట్ స్థానాల్లో తమ బలప్రదర్శనకు ర్యాలీలను సైతం చేయాలని డిసైడ్ అయింది. ఇందులో ఏ ఒక్క సీటు ఇచ్చినా రాష్ట్రమంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని సీపీఐ అంటోంది. మరో వామపక్షమైన సీపీఎం కూడా లోక్‌సభ ఎన్నికలకు తగ్గేదేలే అంటోంది. నాలుగైదు స్థానాలను పరిశీలించి బలమున్న ఏదో ఒకచోట పోటీ చేయాలని పార్టీ భావిస్తోంది. ఇటీవల జరిగిన సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశాల్లోనూ దీనిపై చర్చించారు. దేశంలో ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో కలిసి భాగస్వామిగా ఉన్నందున ఇక్కడ కలిసిపోటీ చేసే అవకాశం తమకు ఇవ్వాలని మార్క్సిస్ట్ పార్టీ అంటోంది.

## కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన డా. జి. చిన్నారెడ్డి

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్,ఏఐసీసీ కార్యదర్శి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
రేవల్లి మండలం జడ్పిటిసి సభ్యులు భీమయ్య, భాస్కర రావు మాజీ సర్పంచ్ జానకి రామ్ రెడ్డి మాజీ ఎంపీపీ,రఘు యాదవ్ సింగిల్ విండో చైర్మన్ గోపాల్పేట చందాపురం, సహదేవ్ మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ చందాపురం గ్రామ యువకులు యాదవ సంఘం అధ్యక్షులు చిరంజీవి. మణిగిల్ల మోజెర్ల నాగరాజు సర్పంచ్ మోజర్ల వారి బృందం గోపాల్ నాయక్ పామిరెడ్డిపల్లి ముందర తండా వారి బృందం,రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి సింగల్ విండో డైరెక్టర్ వారి బృందం, ఆల్వాల లక్ష్మీకాంతరెడ్డి సింగల్ విండో డైరెక్టర్ వారి బృందం పెబ్బేరు తోమాలపల్లి కృపాకర్ రెడ్డి జానపేట మహేశ్వర్ రెడ్డి వివిధ పార్టీలకు చెందిన వివిధ గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఐపిసి నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లేల ఆదిత్య రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి పెంటన్న మాజీ సింగిల్ విండో చైర్మన్ ఐ సత్య రెడ్డి వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షులు కిరణ్ కుమార్, రేవల్లి చిన్నారెడ్డి గోపాల్పేట జి ప్రవీణ్ కుమార్ రెడ్డి వనపర్తి సింగిల్ విండో డైరెక్టర్ రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, మహానంది:**
మహానంది గ్రామంలోని ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన 8 మందిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచిందని అక్కడి స్థానిక ప్రజలు తెలిపారు.ఈ దాడిలో మహానంది గ్రామానికి చెందిన పిచ్చమ్మ, మూడేళ్ల చిన్నారి జహాన్ మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తమై తిమ్మాపురం ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు.వీరిలో చిన్నారి జహాన్ ను మెరుగైన చికిత్స నిమిత్తమై నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు స్థానికులు, వైద్యులు తెలిపారు.

## ఆడపిల్లల అభివృద్ధికి కృషి చేద్దాం

- లక్ష్మి బాయి జిల్లా సంక్షేమ అధికారిణి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
గోపాల్ పేట మండలం కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లక్ష్మీబాయి జిల్లా సంక్షేమ అధికారిని పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలు శ్రద్ధతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి అందుకు అనుభవజ్ఞులైన టీచర్ల సహాయం తీసుకోవాలి. అదేవిధంగా తల్లిదండ్రుల యొక్క శ్రమతో విద్యార్థులుగా చదువుకోగలుగుతున్నాం వారు అనేక రకాల ఆర్థిక ఆరోగ్య విషయాల ద్వారా వివిధ వృత్తులలో నిరంతరం పనిచేస్తూ పిల్లల ఎదుగుదలని తమ ఎదుగుదలని భావించి ఎలాంటి సమస్యలు లేకుండా చక్కగా మనల్ని పెంచడం జరుగుతుంది. అదేవిధంగా ప్రభుత్వ సహకారంతో కస్తూర్బా గాంధీ ప్రభుత్వ పాఠశాలలో చక్కటి వాతావరణంలో చదువుకోగలుగుతున్నాం కాబట్టి చదువుతోపాటు ఎదుగుతున్న వయసు కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది అందుకు ఆడపిల్లలుగా సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి.ఆడపిల్లల పట్ల ఎవరైనా ఇబ్బందులకు గురిచేసిన వారిని కట్టడి చేయడానికి ప్రత్యేకమైనటువంటి చట్టాలు మనకు అందుబాటులో ఉన్నాయి. కావున ఎలాంటి సమస్యలు వచ్చినా చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తున్న అక్రమ రవాణ జరుగుతున్న ఎవరైనా ఆకతాయిలు వెంబడించిన చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబరు 1098 కు సమాచారం ఇచ్చి సహాయం పొందవచ్చును అని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో సిడిపిఓ కృష్ణ చైతన్య , పిఓఎన్ఐసి సురేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రాజేష్ కుమార్ , చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్లు రాజు,బాలరాజు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి , కస్తూర్బా గాంధీ ఎస్ఓ దీప్తి విద్యార్థినిలు పాల్గొనడం జరిగింది.

## మహానంది ఎంపీడీవోగా ఏవో శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు



**టీ మీడియా, ఫిబ్రవరి 29, మహానంది:**
మహానంది ఎంపీడీవోగా ఏవో శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.గురువారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివ నాగజ్యోతి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మహానంది ఎంపీడీవో గా ఆయనని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహానంది మండలంలో ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ప్రజలు సహకరించాలని కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి ని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది,పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
ప్రజా భవన్లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు గా నియమితులైన డాక్టర్ జిల్లేల చిన్నా రెడ్డి ని, ఏఐపిసి తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ. జిల్లెల ఆదిత్యా రెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శాతర్ల భాస్కర్ నాయుడు, రేవల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని అదేవిధంగా పార్టీ నాయకులను కార్యకర్తలను సమన్వయం చెయ్యాలని కోరడం జరిగింది.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయిన సందర్భంగా జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి వనపర్తి నందు గల సివి రామన్ జూనియర్ కళాశాల, త్రివేణి జూనియర్ కళాశాలల నందు గల పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది గుమిగూడవద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు ఎవరైనా సరే పూర్తిగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి సూచించారు.

## తెదేపా అభిమాని కుటుంబానికి రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం



**టీ మీడియా, ఫిబ్రవరి 29, మహానంది:**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి జైల్ లో ఉండగా ఆవేదనలో గుండెపోటుకు గురై మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి మృతి చెందారు. గురువారం మృతుని భార్య సుబ్బలచ్చుమ్మకు తెలుగు దేశం పార్టీ నుంచి వచ్చిన ఆర్థిక సహాయాన్ని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా మూడు లక్షల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ సురేష్ రెడ్డి, మహానంది తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి కాకర్ల శివయ్య, బుక్కాపురం గ్రామ ఉపసర్పంచ్ ఉసేని, మా రెడ్డి సుబ్రహ్మణ్యం, మిద్దె చంద్రశేఖర్, కంచర్ల శివయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పార్లమెంట్ భవనం ఫైవ్ స్టార్ జైలు

- శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్



**టీ మీడియా, ఫిబ్రవరి 29, ముంబై:**
మహారాష్ట్రకు చెందిన శివసేన (యూబీటీ) నేత, ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ కొత్త పార్లమెంట్ భవనంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దానిని ఫైవ్ స్టార్ జైలుగా అభివర్ణించారు. పార్లమెంట్ పని తీరు తీవ్రంగా దెబ్బతిన్నదని విమర్శించారు. గురువారం సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలోని సెంట్రల్ విస్తా పరిస్థితిని ప్రతి ఒక్కరూ చూడాలని అన్నారు. ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొత్త పార్లమెంట్ పని చేయలేని ఫైవ్ స్టార్ జైలు లాంటిది' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా బ్లాక్' కేంద్రంలో అధికారంలోకి వస్తే చారిత్రక పాత పార్లమెంటు భవనానికి పార్లమెంట్ సమావేశాలను మార్చాలన్నది తమ పార్టీ ఉద్దేశమని తెలిపారు. 'మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, మన చారిత్రక పార్లమెంటులో సమావేశాలు నిర్వహిస్తాం' అని అన్నారు. కాగా, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400 కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలకు సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 543 లోక్‌సభ స్థానాలకుగాను 600 సీట్లు గెలుచుకుంటామని ప్రగల్భాలు పలికితే మహారాష్ట్ర ప్రజలు చప్పట్లు కొడతారని అన్నారు. 2024 ఎన్నికల్లో 400కు బదులు 600 సీట్లు టార్గెట్‌గా ప్రధాని మోదీ పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు.



## మహానంది క్షేత్ర పరిధిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 29, మహానంది:**
మహానంది క్షేత్ర పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు తోపుడు బండ్ల యజమానులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది దేవస్థానం పరిధిలోగల షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు మరియు తోపుడు బండ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా, శివరాత్రి ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఉండేందుకు వ్యాపారస్తులు తమ తమ షాపులు యందు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాపార షాపుల యందు ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, భక్తులతో యాత్రికులతో గౌరవప్రదంగా మాట్లాడాలని,తగు సూచనలను అందజేశారు. అందరం కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు.




## ఉద్యోగం కోసం మాజీ మహిళ హోంగార్డు ఆమరణ దీక్ష

**టీ మీడియా, ఫిబ్రవరి 29, రామగుండం:**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాజీ మహిళ హోంగార్డు మామిడి పద్మ గురువారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. తొలగించిన తన హోంగార్డ్ ఉద్యోగం తనకు ఇప్పించా లని ప్రభుత్వానికి, ఉన్నత అధికారులకు గత కొన్ని రోజులుగా వివిధ రూపాలుగా నిరసనలు, ఆందోళనలతో పాటు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.తన కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి,అనారోగ్యం దృష్ట్యా కొద్దిరోజులుగా ఉద్యోగం రాలేకపోయానని నాపై దయ తలచి పోలీసు అధికారులు తనకు ఉద్యోగం ఇప్పించాలని పద్మ వేడుకుంటుంది.

## ప్రైవేటు పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు




**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణం మర్రికుంటలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఎన్ఎన్అర్ ప్రైవేటు పాఠశాలను గురువారం మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి , రాష్ట్ర రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నుంచి మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు లక్కాకుల సతీష్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, సత్యం సాగర్, యాదగిరి, విభూది నారాయణ, లక్ష్మీ రవి యాదవ్ షఫీ, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



**టీ మీడియా, ఫిబ్రవరి 29, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. గురువారం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,వేద పండితులు రవిశంకర అవధాని వెళ్ళీ మహానందీశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు రావాలని, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి,నంద్యాల డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి,నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి,కళ్యాణం ఉభయదాతలు లక్కనబోయిన వెంకటప్రసాద్, తెప్పోత్సవ ఉభయదాతలు అవ్వారు గౌరినాథ్, ధాన్యదాతలు ఎన్ హెచ్ శంకర్ రెడ్డి లను మహానందీశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు రావాలని, ఆహ్వాన పత్రికలు అందజేసారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పదోతరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
చీఫ్ సూపర్ డెంట్ లు ప్రధాన బాధ్యత వహించాలని ఉదాసితకు విళ్లేదని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో జిల్లా విద్యాశాఖ ద్వారా చీఫ్ సూపర్డెంట్ లు అధికారులు ఎంఈఓ లతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ హాజరయ్యారు. మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభ కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లు అధికారుల బాధితలపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ దిశా నిర్దేశం చేశారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ప్రసంగిస్తూ పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో సూపర్డెంట్ లు ఎలాంటి అలసత్వం కానీ ఉదాసీతకు తావు లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది వాటిలో మొత్తం 6906 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలు తరలించడం వాటిని పరీక్ష కేంద్రాల్లో లెక్కల ప్రకారం తీసుకోవడం. తిరిగి సమాధాన పత్రాలను పోస్ట్ ద్వారా పంపే వరకు చీఫ్ సూపర్డెంట్ లు పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. చీఫ్ సూపర్డెంట్ లు సి సి కెమెరాల పరిరక్షణలో మాత్రమే ప్రశ్నపత్రాలను తెరవాలని తెరవాలని చెప్పారు. సంబంధిత కేంద్రాలకు చెందిన ప్రశ్నపత్రాల కోడ్ ను జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. అధికారులు తప్పనిసరిగా పరీక్ష షెడ్యూలు. మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాలు విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు. బెంచీలు. త్రాగునీరు. మరుగుదొడ్లు. సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు రోజుల ముందే పరీక్ష కేంద్రాల ను శుభ్రం చేసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో కాపింగ్ ను ప్రోత్సహించ వద్దు అని అలాంటివి తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహణ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు అకస్మాత్తుగా ఏదైనా జరిగిన. లేదా ఏదైనా అత్యవసర%శీ%ఉన్న వెంటనే అధికారులకు తెలియ జేయాలని అన్నారు. సెంటర్లలో కి ఎట్టి పరిస్థితిలోసెల్ ఫోన్లు అనుమతి లేదని చెప్పారు. ప్రవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థికి హాల్ టికెట్ జారీ చేసే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఎం.ఈ.ఓ. లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, డీ.ఈ.ఓ. గోవిందరాజులు, ఏ. సి. జి. గణేష్, వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, కలెక్టర్ సిసి తిలక్ రెడ్డి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెంట్ లు. విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలప అక్రమంగా ఇటుక బట్టీలకు తరలింపు

**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. టన్నుల కొద్దీ కలప ఇటుక బట్టీలకు తరలుతోంది. అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి రోడ్ల వెంబడి, గుట్టలలో ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయించి సొమ్ము చేసుకుంటున్నారు.రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లను నరికి ఏ మాత్రం భయం లేకుండా ట్రాక్టర్లు, బొలెరో వాహనాలు, లారీల్లో తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి కలపను తరలిస్తున్నారంటే అధికారులు ఏ మేరకు వ్యాపారులతో లాలూచి పడ్డారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు.

ప్రతిరోజూ రోడ్డు మార్గాల్లో కలప తరలుతోంది. అధికారుల చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేని పక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి చేస్తున్నారని అంటున్నారు. విపరీతంగా చెట్లు నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. అడవులు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతుంటే మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు.మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది. అడవులను రక్షించడంతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వాల్టా చట్టం రూపొందించింది. చెట్లను నరికి వేయాలంటే అటవీశాఖ,రెవెన్యూ శాఖ సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి



తీసుకోవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను, గుట్టలను, అడవులలో ఉన్నటువంటి చెట్లను నరికి వేస్తూ ఇటుక బట్టీలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు.

### ఊళ్లలోకి వస్తున్న జంతువులు :

చెట్లను నరికివేయడం, అడవులను ధ్వంసం చేస్తుండటంతో జంతువులు ఆసరా కోల్పోయి ఊళ్లలోకి వస్తున్నాయి. నిత్యం చిరుతలు, ఎలుగుబంట్లు ఊళ్లలో సంచరిస్తున్న విషయాలు పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఇక జింకలు, దుప్పిలు, నెమళ్లు మేత కోసం పంటపొలాలవైపు వస్తున్నాయి. అడవులు నాశనం చేయడంతోనే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆధునిక యంత్రాలను వినియోగించి గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి వేస్తూ వాహనాల్లో తరలిస్తున్నారు.

### కాసులు కురిపిస్తున్న దందా :

వేప, తుమ్మ చెట్లను సైతం అక్రమార్కులు వదలడం లేదు. పంట చేలు, గుట్టల ప్రాంతాలోని చెట్లు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన వృక్షాలు నేలకూలుస్తున్నారు. కలప వ్యాపారులు తక్కువ ధరకు చెట్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని నరికి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ క్వింటాళ్ల చొప్పున అమ్ముకుంటున్నారు. చెట్ల నరికివేత పై అధికారుల నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కలపను అధిక ధరలకు విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### దళారులపై చర్యలు తీసుకోవాలి

మొక్కలను పెంచడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయిలు కేటాయిస్తూ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. చెట్లు నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు చెట్ల ఆవశ్యకతను వివరించాలి. చెట్లను నరికివేసిన కారణంగా భవిష్యత్తులో మరిన్ని కరువు కాటకాలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా చెట్లను సంరక్షించాలి.

### కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం :

### జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రశాంత్ రెడ్డి

ప్రతిరోజూ ట్రాక్టర్లు, లారీల ద్వారా కలప తరలుతోందనే విషయం తెలియదు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కలప నరికివేయకుండా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అక్రమంగా కలప నరకడం, తరలించడం వంటివాటిని అరికడతాం. పట్టుబడిన వారిపై చర్యలు తీసుకుంటాం. సంబంధిత ప్రాంతాలలో నిఘా ఉంచుతాం. ఇటుక బట్టీల్లో దాడులు చేసి చర్యలు చేపడతాం అన్నారు.



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుకు ప్రభుత్వం సిద్ధం

**టీ మీడియా, ఫిబ్రవరి 29, గోదావరిఖని :**
రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పూదరి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఇళ్ల స్థలాల కేటాయింపు పై ఇటీవల చర్చించడం జరిగిందని త్వరలోనే రామగుండం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కూడా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంను ఒప్పించి 130 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించాను అన్నారు. గతంలో మంజూరై వినియోగంలో లేకుండా ఉన్న 29 కోట్ల రూపాయల నిధులు మళ్లిపోకుండా అభివృద్ధి కోసం ఖర్చు చేసేలా తిరిగి ఆ నిధులను తేనున్నామని తెలిపారు. గంజాయి పై పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో గంజాయి సరఫరా కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి చాపకింద నీరుల వ్యాపిస్తుందని అలాగే నియోజకవర్గంలో కూడా విచ్చలవిడిగా గంజాయి చాప కింద నీరులా సరఫరా అవుతుందని వీటిపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకొని నిందితులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్, రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, క్లబ్బు తొలి అధ్యక్షులు అల్లంకి లచ్చయ్య క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యాంసుందర్ కోశాధికారి గడ్డం శ్యాం కుమార్ తో పాటు అధిక సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు కాగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని క్లబ్ వ్యవస్థాపకులు ఎల్లంకి లచ్చయ్య, వేల్పుల నారాయణ, జక్క మారుతి, శ్రీ దాస్యం లక్ష్మయ్య, పారుపల్లి రాజలింగం, పిట్టల ముండయ్యతో, పాటు ఎమ్మెల్యే, ఇతర అధికారులను ఆత్మీయంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



## అంతర్జాతీయ రంగాలను భవిష్యత్తులో శాసిచిందే్యవసాయమే

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 29, వనపర్తి బ్యూరో :**
వ్యవసాయ రంగాన్ని ఎంచుకొని సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చెన్నారం గ్రామములో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ మెళు కువలు, ఆధునిక పద్ధతులు అధ్యయనం చేస్తున్న వ్యవసాయ విద్యార్థులను పలకరించి నిరంజన్ రెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆహార ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే విధంగా ఎదుగుతుందని అన్నారు. కెసిఆర్ వ్యవసాయానికి అత్యంత ప్రాదాన్యత ఇచ్చి ప్రోత్సహించారని అన్నారు. విద్యార్థులను అభినందించి వ్యవసాయ రంగంలో ఎన్నో పరిశోధనలు చేసి రైతులకు మేలు చేయాలని కోరారు. విద్యార్థులు నిరంజన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపి మీ హాయంలో మాకు అన్ని విధాలుగా ప్రోత్సహించారు అని అన్నారు.

Regd. No. 100/20
T MEDIA
టీ-మీడియా ఆన్‌లైన్ సర్వీసెస్
కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నిబంధనలు
ప్రకారం మీడియా (యూట్యూబ్‌లు, వెబ్‌సైట్‌లు, ఈ పేపర్స్ తదితర)
గుర్తింపు కోసం చట్టపరమైన ఇబ్బంది లేకుండా
అవసరం అయిన సర్టిఫికేట్ల
దరఖాస్తులు ప్రాసెసింగ్ చేయబడును.